సాక్షి నల్లగొండ

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025

I



తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలి

పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - IIలో



టీటీడీ తరహాలో శిక్షణ

యాదగిరిగుట్ట ఆలయ సిబ్బందిని వివిధ అంశాలపై శిక్షణకు టీటీడీకి పంపనున్నట్లు ఈఓ తెలిపారు - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	586.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	86,585 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	50,578 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	32,724 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	5,654 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

చిట్యాల : చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గతంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గోగికార్ మాధవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు బుధవారం డీఈఓ భిక్షపతి ఉత్తర్వులు జారీ చేసినట్లు చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ తెలిపారు. గతంలో చిట్యాల జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా మాధవి పని చేసిన సమయంలో పాఠశాలకు మంజూరైన పీఎంశ్రీ నిధుల దుర్వినియోగానికి గుర్రైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. డీఈఓ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టగా వారిపై మాధవి దురుసుగా ప్రవర్తించి వాగ్వాదానికి దిగింది. దీంతో సంబంధిత విచారణ అధికారులు జిల్లా అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ అధికారి సిహెచ్.యోగేంద్రనాథ్, చిట్యాల ఎంఈఓ సైదానాయక్ ఈ సంఘటనపై డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో శాఖా పరమైన చర్యల్లో భాగంగా డీఈఓ భిక్షపతి మాధవిని ఉద్యోగ సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

కొండమల్లేపల్లి (చింతపల్లి) : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పోలేపల్లి రాంనగర్‌లోని పల్లె దవాఖానాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని, మలేరియా, డెంగీ తనిఖీ పరీక్షల కోసం అందుబాటులో ఉన్న ఆర్డీటీ నిల్వలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఉప వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : నల్లగొండ శివారులోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ పురుషులకు ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు రఘుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు గల నల్లగొండ, సూర్యాపేట, యదాద్రి భువనగిరి జిల్లాల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు సంస్థ ఆఫీసులో సెప్టెంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9701009265 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అధికారుల సూచనలు పాటించాలి

భువనగిరి : పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం.యాకాద్రి రైతులకు సూచించారు. భువనగిరి మండలం వీరవెల్లి, కూనూరు గ్రామాల్లో బుధవారం ఆయన వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఆయా పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ యే పంటలు సాగు చేశారు. పంటల పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, రైతులు ఉన్నారు.

● అన్నదాత ఆవేదన



పెద్దవూర : యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్దవూరలో కోదాడ - జడ్చర్ల హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు



శాలిగౌరారం : యూరియా కోసం శాలిగౌరారం పీఏసీఎస్ ఎదుట బారులుదీరిన రైతులు

6న ఉద్యోగులకు క్రీడాపోటీలు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లో ఈనెల 9, 10 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 6వ తేదీన నల్లగొండలో మినిస్టీరియల్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యుజజన క్రీడల అధికారి అక్బర్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, లాన్‌టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖోఖో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఫుట్‌బాల్ పోటీలు పురుషులకు నిర్వహిస్తామని తెలిపారు.

స్వామి పేర.. సొమ్ము స్వాహా!

చెర్వుగట్టు చుట్టూ రోడ్ల మరమ్మతు పనులు చేయకుండానే ఎంబీలు

- పంచాయతీ నిధులు రూ.33 లక్షలు నొక్కేసినట్లు ఆరోపణలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నాయకులు, గ్రామస్తులు
- పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు



రోడ్లకు మరమ్మతు చేయకుండానే..

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతాయి. ఈ వేడుకలకు ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవాదాయ శాఖ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇక్కడ సౌకర్యాలు కల్పిస్తారు. అయితే ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో రోడ్ల మరమ్మతు పనులు చేయకున్నా చేసినట్లుగా.. ఇతర పనులకు సంబంధించిన రూ.33 లక్షలు అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు గత నెల 8న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో చెర్వుగట్టు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అయిన ఎంపీడీఓకు, పంచాయతీ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. పనులను పరిశీలించకుండా ఎంబీలు చేసిన పంచాయతీ రాజ్ శాఖ ఏఈ, డీఈకి మాత్రం ఇవ్వలేదు. ఆ నిధుల స్వాహాపై సమగ్ర విచారణ జపాలని కోరుతున్నారు.

చెర్వుగట్టులో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించే సమయంలో గ్రామంలోకి వచ్చే రోడ్లకు మరమ్మతు చేస్తారు. చెర్వుగట్టు నుంచి ఎల్లారెడ్డిగూడెం, నందుల రోడ్డు, కామినేని రోడ్డు, ఏపీ లింగోటం రోడ్డు, గుమ్మలబావి రోడ్ల మరమ్మతు చేపడతారు. కానీ.. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు సమయంలో కేవలం చెర్వుగట్టు నుంచి ఎల్లారెడ్డిగూడెం, నందుల రోడ్లను మాత్రమే మరమ్మతు చేశారు. మిగలిన రోడ్లును వదిలేశారు. కానీ.. అన్ని రోడ్ల పనులు చేసినట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఎంబీ చేయడంతో పంచాయతీ కార్యదర్శి రూ.20 లక్షల వరకు డ్రా చేసినట్లు తెలిసింది.

కార్మికులకు జీతాలు ఇవ్వలే..

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ ద్వారా గ్రామ పంచాయతీకి రూ.12.50 లక్షలు రెండు విడతలుగా వచ్చాయి. ఆ డబ్బులో కేవలం రూ.6.51 లక్షలు మాత్రమే ఎస్‌టీఓలో చేశారు. మిగతా డబ్బు టీఎస్ బీపాస్‌లో జమ చేసి వ్యక్తి గతంగా డ్రా చేసి స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక, పంచాయతీ కార్మికుల జీతాల కోసం రూ.6 లక్షలు వస్తే ఆ డబ్బును టీఎస్ బీపాస్‌లో జమ చేసి డ్రా చేశారని తెలిసింది. కార్మికులకు మాత్రం ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదు. 2025లో గ్రామ పంచాయతీ దుకాణాల వేలం పాట ద్వారా రూ.48.51 లక్షలు పంచాయతీకి వచ్చాయి. ఆ డబ్బులను కూడా ఎస్‌టీఓలో జమ చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 2024 జూన్‌లో పంచాయతీకి చెందిన 9వ నంబర్ షాపు దక్కించుకున్న వ్యక్తి వేలంలో రూ.లక్ష డిపాజిట్ కోల్పోయాడు. ఆ మొత్తం కూడా ఎస్‌టీఓలో జమ చేయలేదని తెలుస్తోంది. ఇలా పంచాయతీ నిధులు సుమారు రూ.33 లక్షలు స్వాహా చేసిన విషయంలో అధికారులు సమగ్ర విచారణ జరిపి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు కోరుతున్నారు.

ఎంబీ చేయడం వల్లే సంతకం చేశా

చెర్వుగట్టు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పర్యవేక్షణలో పనులు చేశారు. ఆ పనుల్లో అవినీతి జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. అయితే పనుల విషయంలో పూర్తి సమాచారం ఉన్న పంచాయతీ రాజ్ శాఖ ఏఈ, డీఈకి నోటీసులు ఇవ్వలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారికి మాత్రమే ఇచ్చారు. పంచాయతీ రాజ్ ఏఈ ఎంబీ చేయడం వల్లే నేను సంతకం చేశా.

– ఉమేష్, ఎంపీడీఓ, చెర్వుగట్టు పంచాయతీ ప్రత్యేకాధికారి

నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం

చెర్వుగట్టు గ్రామపంచాయతీలో బ్రహ్మోత్సవాల సమయంలో అవినీతి జరినట్లు ఫిర్యాదు వచ్చింది వాస్తవమే. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ అధికారిగా నలగొండ డీఎల్‌పీఓను నియమించాం. నోటీసులు ఎంతమందికి ఇచ్చారనే విషయం నాకు తెలియదు. విచారణ నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం.

– వెంకయ్య, డీపీఓ

గణేష్ శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు

- 1500 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు
- ఎస్పీ శరత్ చంద్ర పవార్



దేవరకొండ : కొండభీమనపల్లి చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన వివరించారు. ఈ నెల 5 నుంచి నిర్వహించే శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు భద్రతా ఏర్పాటు చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలోని అన్ని గణేష్ విగ్రహాలు, మండపాలకు జియో ట్యాగింగ్ చేసి తమకు కేటాయించిన నంబర్లతో శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

భద్రత కోసం 950 మంది సిబ్బంది..

గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక ఏఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 60 మంది ఎస్‌ఐలు, 850 మందికి పైగా ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏఆర్ సిబ్బంది స్పెషల్ పార్టీతో కలిపి మొత్తం 950 మంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారని తెలిపారు.

శోభాయాత్రలో పాల్గొనే భక్తులకు నిబంధనలు ఇలా..

- శోభా యాత్ర జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని ప్రజలు గమనించాలి.
- గణపతి విగ్రహాల్ని తీసుకెళ్లే వాహనాలను చెకప్ చేయించుకోవాలి.
- మద్యం తాగి వాహనాలను నడపొద్దు.
- డీజేలకు అనుమతి లేదు. టపాకాయలు కాల్చొద్దు.
- చిన్న పిల్లలు తప్పిపోయే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి.
- వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాలైన చెరువుల, కాలవల వద్ద చిన్న పిల్లలకు అనుమతి లేదు.
- నిమజ్జన సమయంలో యువకులు సంయమనం పాటించాలి.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రధాన పట్టణాల్లో గణేష్ నిమజ్జన శోభయాత్రను 24 గంటలు జిల్లా పోలీసు కార్యాలయం కమాండ్ కంట్రోల్ పర్యవేక్షిస్తుందని తెలిపారు. పోలీస్ శాఖ తరఫున, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ఏర్పాటు చేసిన సుమారు 1500 సీసీటీవీ కెమెరాలను ఆయా పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేశామన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలోని ప్రధాన నిమజ్జన ప్రాంతాలైన నల్లగొండలోని వల్లభరావు చెరువు, మూసీ రిజర్వాయర్, 14వ మైలు రాయి, మిర్యాలగూడ, వాడపల్లి, నాగార్జునసాగర్, దయ్యాలగండి, అడవిదేవులపల్లి, దేవరకొండ, కొండబీమనపల్లి, డిండి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతానికి అయినా ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో పెట్రో వాహనాలు, బ్లూకోట్స్, సంబంధిత పోలీసు అధికారులు చేరుకునేలా ఆన్‌లైన్ విధానంలో భద్రతను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గణేష్ నిమజ్జనం రోజున జిల్లా కేంద్రంలో ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేస్తామన్నారు.

నేత కార్మికులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం



నల్లగొండలో జౌళి శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వర్షిత్‌రెడ్డి, నేత కార్మికులు

నల్లగొండ టూటౌన్ : నేత కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. నేత కార్మికుల సమస్యలపై బుధవారం నల్లగొండలోని జౌళి శాఖ ఉన్నతాధికారికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నేతన్న పొదుపు పథకం ద్వారా అర్హులైన ప్రతి నేత కార్మికునికి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మిర్యాల వెంకన్న, బోగరి అనిల్‌కుమార్, కిషన్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

కనగల్ : ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పద్మ, ఎంపీఓ సుమలత, ఆర్ఐ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, బోగరి రాంబాబు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాలు హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కాంతయ్య

నల్లగొండ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య తెలిపారు. నల్లగొండలో బుధవారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారీ వేతనం రూ.700 ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీల్లో కూడా ఉపాధి హామీ పథకం విస్తరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేసి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లొడంగి శ్రావణ్ కుమార్, బొలుగురి నరసింహ, సీహెచ్ ఉషయ్య, ఎం.వెంగళయ్య, వేముల బుచ్చయ్య, ఎండీ జాన్మియా, ఉప్పునూతల రమేష్ శంకర్‌నాయక్, లాలయ్య, ఇంజమూరు నరసింహ, వల్లపు పెంటయ్య జి పెద్ద నరసింహ, దోటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

44,099 కార్డులకు తొలిసారిగా..

- రేషన్ దుకాణాల్లో సెప్టెంబర్ నెల కోటా సన్న బియ్యం పంపిణీ
- ఇప్పటికే షాపులకు చేరిన 75 శాతం బియ్యం



నల్లగొండలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

నల్లగొండ : సెప్టెంబర్ నెలకు సంబంధించి సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైంది. బుధవారం నుంచి పూర్తిస్థాయిలో షాపులు తెరిచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే 75 శాతం బియ్యం గోదాముల నుంచి రేషన్‌షాపులకు చేరింది. ఈ నెల నుంచి కొత్తగా 44,099 కార్డులకు బియ్యం అందనుంది.

5,550 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా

ప్రభుత్వం జూన్‌లోనే మూడు మాసాలకు(జూన్, జూల్, ఆగస్టు) సంబంధించిన బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే రేషన్ పోర్టబులిటీ విధానం అమలులో ఉన్నందున అందుబాటులో ఉన్న షాపుల్లో కార్డుదారులు వేలిముద్ర వేసి బియ్యం తీసుకుంటున్నారు. వారి కార్డు ఉన్న షాపుల్లో బియ్యం కోటా మిగులుతుంది. ఇలా చాలా చోట్ల షాపుల్లో జూన్ నెలలో సరఫరా చేసిన బియ్యం నిల్వ ఉంది. దీంతో ఈమాసం లో ఏఏ షాపుల్లో ఎంత సన్న బియ్యం మిగిలాయో వివరాలు తెలుసుకుని వారి కార్డులకు అనుగుణంగా పౌర సరఫరాల అధికారులు బియ్యం పంపిస్తున్నారు. జిల్లాలో 5,28,303 రేషన్‌కార్డులు ఉండగా.. వీటికి సంబంధించి ఇప్పటి వరకు 5,550 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించారు.

కొత్త కార్డులు మంజూరు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో కొత్తగా 65,749 రేషన్ కార్డులను మంజూరు చేసింది. వాటిలో జూన్‌కంటే ముందే కార్డులు పొందిన 21,649 కార్డుదారులు జూన్‌లోనే మూడు నెలల బియ్యం తీసుకున్నారు. ఈ సెప్టెంబరు నుంచి జిల్లాలో 44,099 కుటుంబాలు మొదటిసారి సన్న బియ్యం తీసుకోనున్నారు.

నీలగిరిలో రెండు రోజులు ఆలస్యంగా..

సెప్టెంబర్ నెలకు సంబంధించి గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు ఆగస్టు చివరికే బియ్యం సరఫరా చేశారు. పట్టణ ప్రాంతంలో కొన్ని షాపుల్లో పాత నిల్వ ఉండడంతో రవాణాలో కొంత జాప్యం జరిగింది. కానీ పాత నిల్వను కూడా పంపిణీ చేసేందుకు 1వ తేదీ నుంచి దుకాణాలు తెరవాల్సి ఉన్నా.. నల్లగొండలో కొందరు డీలర్లు దుకాణాలు తెరవలేదు. కొందరు 2వ తేదీన, మరికొందరు 3వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో షాపులు తెరిచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు కొంత ఇబ్బంది పడ్డారు.

భూ వివాదంపై సబ్‌కలెక్టర్ విచారణ



బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

పెద్దవూర : మండలంలోని పోతునూరు గ్రామంలో భూ వివాదంపై మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ బుధవారం విచారణ చేపట్టారు. పోతునూరు స్టేజీ వద్ద ఎన్‌హెచ్–161 పక్కన సర్వే నంబర్ 290లో గ్రామానికి చెందిన పలువురు దళితులు పూరి గుడిసెలు వేసుకున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన మేడారం యాదయ్య 290 సర్వేనంబర్‌లో తనపేరు మీద 1.12 ఎకరాల భూమి పట్టా ఉందని.. తన భూమిలో గుడిసెలు వేసుకున్నారని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఆశ్రయించాడు. దీంతో బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు పోతునూరు స్టేజీ వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. పూరి గుడిసెలు వేసుకున్న వారితో మాట్లాడారు. 2023 అక్టోబర్ 4వ తేదీన 298 సర్వే నంబర్‌లో గ్రామానికి చెందిన 58 మందికి 80 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారని, ప్లాట్ నంబర్లు ఇస్తామని చెప్పి నాటి తహసీల్దార్ తమ నుంచి పట్టాలను తీసుకున్నారని తెలిపారు. కానీ ఎన్నిసార్లు అడిగినా పట్టాలు తిరిగి ఇవ్వడం లేదని వివరించారు. దీనిపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని అడగా.. సర్వేనంబర్ 298లో 58 మందికి పట్టాలు ఇచ్చింది వాస్తవమేనని, ప్లాటింగ్ చేసి ఇస్తామని చెప్పిన పట్టాలు తీసుకున్నామని తెలిపారు. తహసీల్దార్‌ను భూమి వివరాలు అడుగగా 2020లో సర్వే చేశారని.. 290 సర్వే నంబర్‌లో 10.17 ఎకరాల భూమి ఉండగా 2.30 ఎకరాలు ఎస్‌ఎల్‌బీసీ కాలువకు, 0.33 ఎకరాలు వాటర్ పైప్‌లైన్‌కు, 1.31 ఎకరాల భూమి పోతునూరు, పులిచర్ల రోడ్డుకు, 3.30 ఎకరాలలో నివాస గృహాలు, 1.12 ఎకరాలు మేడారం యాదయ్య పేరు మీద ఉన్నట్లు, 0.5 గుంటలు ఎన్‌హెచ్–161 రోడ్డుకు, మరో 0.16 గుంటలు ఆక్రమణకు గురైనట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకున్న సబ్ కలెక్టర్ గురువారం పెద్దవూర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని గుడిసెలు వేసుకున్న వారికి సూచించారు. అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే.. కోర్టుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ వివాదం సద్దుమణిగే వరకు తమ గుడిసెల జోలికి ఎవరూ రావద్దని సబ్ కలెక్టర్‌కు వారు విన్నవించారు. ఆయన వెంట తహసీల్దార్ శాంతిలాల్, డీటీ శ్రీదేవి, సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐలు ప్రసాద్, ముత్తయ్య, ఆర్‌ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: స్తంభోద్భవుడి క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామికి బుధవారం ఏకాదశిని పురస్కరించుకొని అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా లక్ష పుష్పార్చన పూజ నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన ఉత్సవ మూర్తులకు సుగ్రంథ పరిమలాలు వెదజల్లే రంగుల పుష్పాలు, తులసీ దళాలతో లక్ష పుష్పార్చన జరిపించారు. లక్ష పుష్పార్చన పూజలో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ఆలయంలో నిత్యకైంకర్యాలు కొనసాగాయి.



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం



పాఠశాలను పరిశీలిస్తున్న వెంకటేష్

నార్కట్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని హైస్కూల్‌ను ఆయన సందర్శించి పాఠశాల పురోగతిపై మాట్లాడారు. రాష్ట్రంలో 30 శాతం మంది ప్రభుత్వ 70 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థపై దృష్టి పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ సమస్యలను 90 శాతం పరిష్కరించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో టీపీఎస్ పద్ధతిలో నాలుగు పాఠశాలలు కొనసాగుతున్నాయని వాటిలో నాగర్ కర్నూల్ జిల్లాలో 2, రంగారెడ్డి జిల్లాలో 2 ఉన్నాయని తెలిపారు. త్వరలో నార్కట్‌పల్లి హైస్కూల్‌ను కూడా టీపీఎస్ పద్ధతిలో అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. టీపీఎస్ పద్ధతి గల పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన ఉంటుందని పేర్కొనఆనరు. ఈ సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని హెచ్‌ఎం రాములు ఆయనకు వివరించారు. తెలుగు బయోకెమిస్ట్రీ ఉపాధ్యాయుడు లేడని.. తెలపగా.. వెంటనే భర్తీ చేయాలని సంబంధిత అధికారిని ఫోన్‌లో ఆదేశించారు. ఆయన వెంట డీఈఓ భిక్షపతి, ఎంఈఓ నరసింహ, వి.నాగరాజు, మహేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి గాయాలు

చిట్యాల: యూటర్న్ తీసుకుంటున్న బైక్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన దేశపాక శ్రీశాంత్(20), చిట్యాల పట్టణానికి చెందిన శివకార్తీక్ మంగళవారం రాత్రి బైక్‌పై చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గల చెరువు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీశాంత్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శివకార్తీక్‌ను నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఉమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

డిండి: అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వాహనాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి నుంచి తవక్లాపూర్ వెళ్లే మార్గంలో ఇండికా కారులో 450 కేజీల నల్లబెల్లం, 30 కేజీల పటికను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కారును పట్టుకున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నర్సింహ, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వెండి వస్తువులు, నగదు అపహరించారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని ఎల్బీనగర్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు ఫిర్యాదు మేరకు భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా భువనగిరి పట్టణంలోని రాంగనర్ కాలనీ సమీపంలోని సెల్ టవర్ వద్ద బ్యాటరీ, ఇతర వైర్లు చోరీకి గురైనట్లు నిర్వాహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

నార్కట్‌పల్లి: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి నుంచి మునుగోడు వెళ్తున్న కారు మార్గమధ్యలో బ్రాహ్మణ వెల్లంల గ్రామ శివారులో రోడ్ క్రాసింగ్ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు.



పొలాల్లోకి వెళ్లిన కారు

అంతుచిక్కని వ్యాధి.. అంతులేని వ్యథ

- మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- అన్నీ తానై చూసుకుంటున్న భార్య
- అప్పు చేసి వైద్యం చేయించినా కోలుకోని వైనం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

కన్నీటి గాథ

అడవిదేవులపల్లి: సజావుగా సాగుతున్న వారి జీవితం ఒక్కసారిగా కుదేలైంది. భార్యాపిల్లలతో ఆనందంగా గడుతున్న ఆ కుటుంబ పెద్దకు అంతుచిక్కని వ్యాధి సోకి మంచానికే పరిమితమయ్యాడు. అప్పు చేసి మరీ వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం పూట గడవడమే కష్టంగా మారింది. వివరాలు.. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి కలకండ చినసైదులు, మౌనిక భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు హర్షవర్దన్, అనిర్యణ్య సంతానం. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2023 ఆగస్టులో చినసైదులుకు కుడి చేతి బొటనవేలికి వాపు వచ్చింది. దీంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. రోజుల వ్యవధిలోనే వాపు చేతికి మొత్తం పాకింది. వెంటనే మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అయినా వాపు తగ్గకపోగా.. శరీరం మొత్తం చచ్చుబడిపోయింది. చేతులు, కాళ్లు పనిచేయకపోవడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు.



భర్తకు అన్నం తినిపిస్తున్న మౌనిక

అప్పులపాలైన కుటుంబం..

రెండేళ్లుగా అంతుచిక్కని వ్యాధితో చినసైదులు పెద్దాస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. అతడికి మెరుగైన వైద్యం అందించాలని కుటుంబ సభ్యులు ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు అప్పు చేశారు. తమకున్న ఎకరం పొలం, ఇంటి స్థలాన్ని కూడా అమ్ముకున్నారు. ఒక వైపు తెచ్చిన అప్పులు తీర్చలేక, మరో వైపు కుటుంబం గడవడం కష్టంగా మారిందని చినసైదులు భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లలను అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ.. ఇంటి వద్దనే ఉంటూ భర్తకు సేవలు చేస్తోంది మౌనిక . సదరం సర్టిఫికెట్‌లో 82శాతం దివ్యాంగుడని ధ్రువీకరించినా ప్రభుత్వం చినసైదులుకు పింఛన్ మంజూరు చేయలేదని అతడి భార్య వాపోయింది. దయార్ద్ర హృదయులు స్పందించి ఆర్థిక సాయం చేస్తే తన భర్త ఆరోగ్యం బాగుపడుతుందని, తమ కుటుంబం కష్టాల నుంచి గట్టెక్కుతుందని చినసైదులు భార్య మౌనిక వేడుకుంటోంది.

దాతలు ఆదుకోండి సారూ..



నా భర్తకు వైద్యం చేయించడానికి ఇప్పటికే రూ.10లక్షలు అప్పు చేశాం. ఎవరైనా దాతలు 9347606721 నంబర్‌ను సంప్రదించి మమ్మల్ని ఆదుకోండి సారూ. నా భర్తకు కనీసం పింఛన్ అయినా ఇస్తే మా కుటుంబం గడుస్తుంది. కనీసం వీల్‌చైర్ అయినా అందించండయ్యా. – మౌనిక, చినసైదులు భార్య

వాంగ్మూలం ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- కల్వకుంట్ల కవితకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచన

సాక్షి,యాదాద్రి: బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండైన కల్వకుంట్ల కవిత కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామని, ఆమె సీబీఐకి వాంగ్మూలం ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని జలగల్లా ఐదుగురు కలిసి దోచుకున్నారని, అందులో కవిత కూడా ఉందని ఆరోపించారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు ఇంట్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ ఎట్లా అవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని అన్నారు. కవిత ఆరోపించినట్లు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, సంతోష్‌రావు అవినీతి చేస్తుంటే చూస్తున్న కేసీఆర్ కూడా అవినీతిపరుడే కదా అని ప్రశ్నించారు. దోచుకున్న అవినీతి సొమ్ము పంపకాల్లో పంచాయితీతోనే కవిత బయటకు వచ్చారని ఆరోపించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ త్వరితగతిన పూర్తిచేసేలా చొరవ చూపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావును కాపాడే ఉద్దేశం ఉంటే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వైరీ ఎందుకు వేస్తాడని ఎంపీ అన్నారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారని చెప్పేందుకు కవితనే మొదటి ఎవిడెన్స్ అని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి సీబీఐ ఎంక్వైరీ వేయడాన్ని అసెంబ్లీ సాక్షిగా అన్ని పార్టీలు ముక్తకంఠంతో సమర్థించాయని, కానీ బీజేపీ మాత్రం సమర్థించలేదని ఆరోపించారు. అనంతరం భువనగిరి పట్టణంలో జరుగుతున్న ఎంఎంటీఎస్ పనులను వారు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఎంటీఎస్ నిర్మాణానికి కేంద్రం రూ.420 కోట్లు నిధులు మంజూరు చేసిందని, త్వరగా పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.



భువనగిరిలో ఎంఎంటీఎస్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కోదాడరూరల్: బొలేరో వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్‌లో బుధవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండకు చెందిన బొలేరో డ్రైవర్ బాలేబోయిన వీరబాబు, పశువుల వ్యాపారి వెంకన్న ఖమ్మం జిల్లా వైరా పరిసర ప్రాంతాల్లో 10 పశువులను కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా బొలేరో వాహనంలో కోదాడ పశువుల సంతకు వస్తుండగా.. మార్గమధ్యలో రామాపురం క్రాస్ రోడ్‌లో బుధవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. పశువులను గోశాలకు తరలించి డ్రైవర్ వీరబాబు, పశువుల వ్యాపారి వెంకన్న, వాహన ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం

తుంగతుర్తి : ఎక్సైజ్ తనిఖీల్లో, క్రైం కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆరు వాహనాలకు బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా జీఎస్టీతో కలుపుకొని రూ.1,04,548 ఆదాయం వచ్చినట్లు సీఐ రజిత తెలిపారు.

కేసీఆర్‌ను బదనాం చేయడానికి కుట్ర



నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం కమీషన్, సీబీఐ విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌ను బదనాం చేయడానికి కుట్ర పన్నుతోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణంపై సీబీఐతో విచారణ చేయాలని తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రామన్నపేటలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేశారు. పాత బస్టాండ్ నుంచి సుభాష్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి చిట్యాల–భువనగిరి రోడ్డుపై ధర్నా చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని చిరుమర్తి లింగయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చిరుమర్తి విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని కేసీఆర్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా, నాణ్యమైన విద్యుత్ ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడవని, అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటారని చెప్పారు. అధికారులు, పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలకకుండా రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, నీల దయాకర్, కమ్మంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, బద్దుల ఉమారమేష్, వేమవరపు సుధీర్ బాబు, దోమల సతీష్, సాల్వేరు అశోక్, బందెల యాదయ్య, ఎండీ ఆమేర్, ఎస్కే చాంద్, కన్నెబోయిన బలరాం, బత్తుల వెంకటేష్, మిర్యాల మల్లేశం, బొడ్డు అల్లయ్య, గర్దాసు విక్రం, మామిండ్ల అశోక్, బుర్ర శ్రీశైలం, గంగుల రాఘవరెడ్డి, పున్న వెంకటేశం, ధర్నె భాస్కర్, ఎడ్ల రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జంగిలి నర్సింహ పాల్గొన్నారు.

పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంజీయూలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మ్యాథమెటికల్ అప్లికేషన్స్‌పై నిర్వహించిన జాతీయ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.గణితశాస్త్రం నిత్య జీవితంలో మానవాళికి అనేక రకాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధునిక సమాజ నిర్మాణంలో గణితం పాత్ర విడదీయరానిదని అన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ.. సమాజ దశ దిశను నిర్దేశించగల శక్తి ఉన్నత విద్యకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, డి. శ్రీనివాసచార్య, పద్మనాభరెడ్డి, చందూలాల్, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, అన్నపూర్ణ, ఉపేందర్‌రెడ్డి, హైమావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

విద్యార్థుల భవిష్యత్తుకు పరిశోధనలే కీలకం

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు పరిశోధనలే కీలకమని, ప్రతి విద్యార్థి పరిశోధనల ద్వారా తన ప్రతిభను నిరూపించుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలోని సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎల్ఈడీ స్క్రీన్‌లో ఎంజీయూలోని వివిధ విభాగాల్లో జరిగే విద్యా కార్యక్రమాలు, ప్రగతి సమాచారం , విశ్వవ్యాప్తంగా జరిగే పరిశోధనల సమాచారం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ధర్నా

సంస్థాన్ నారాయణపురం : హెచ్ఎండీఏ ప్రకటించిన రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాలకు రైతులు, నిర్వాసితులు బుధవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏళ్ళుగా తరబడి సాగు చేసుకుంటున్న భూములు తీసుకొని తమ పొట్టకొట్టొదన్నారు. ఈ అలైన్‌మెంట్‌తో తీవ్రంగా నష్టం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు భూమి తీసుకుంటే మార్కెట్ విలువ ఆధారంగా డబ్బులు చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పల్లె పుష్పారెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్రి నర్సింహ్మా, చిలువేరు అంజయ్య, దోనూరి నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, నెల్లికంటి రాములు తదితరులు సంఘీభావం తెలిపారు.



తహసిల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

అధిక వర్షాలు.. ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు

పాడిపంట

గుర్రంపోడు: గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పండ్లు, పూలు, కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. వరుస వర్షాలతో ఆశించే వ్యాధికారక శిలీంధ్రాలు, చీడపీడలను తగ్గించడానికి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు టి. సురేష్‌రెడ్డి చెబుతున్నారు. ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు ఆయన మాటల్లోనే..



మామిడి తోటలో నిలిచిన నీరు

పండ్ల తోటల్లో..

అధిక వర్షాలకు కుంటలు, కాల్వలు, వరి సాగు ఉన్న చోట నీరు ఉబికి పండ్ల తోటల్లోకి రాకుండా చుట్టూ గాడి తవ్వుకోవాలి. చనిపోయిన మొక్కలను తొలగించి కొత్తవి నాటుకోవడం, వాలిపోయిన మొక్కలను సరిచేసి మొదలుకు మట్టిని ఎగదోసి కర్రతో ఊతమివ్వాలి. తర్వాత 19:19:19 నీటిలో కరిగే పాలీఫీడ్ ఎరువును ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే మొక్క చుట్టూ మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని నేలలో ఇంకేలా పోయాలి. గాలులకు విరిగిపోయిన చెట్ల కొమ్మలను కత్తిరించి చివర్లకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పూయాలి లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. మామిడిలో చీడపీడల ఉధృతిని తగ్గించడానికి ఒక గ్రాము కార్బండిజమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగుల నివారణకు ఇమిడాక్లోపిడ్ 0.3 మిల్లీలీటరును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 10 గ్రాముల మల్టీకే మందును మరియు బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయ పంటల్లో..

పడిపోయిన కూరగాయ మొక్కల చుట్టూ మట్టిని ఎగదోసి నిలబెట్టాలి. మొక్కలు ఆకులు, కొమ్మలతో ఏపుగా ఉంటే 0.3 శాతం 13:0:45 నీటిలో కరిగే మల్టీకే లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. ఆయా కూరగాయల రకాలను బట్టి అవసరమైన పురుగు నివారణ మందులు పిచికారీ చేయాలి.

మిరుప తోటల్లో..

వర్షాకాలంలో మిరుపలో వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. దీని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు లీటరు నీటికి కలిపి నారుమడి మొత్తం పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. మొక్కలు ఏపుగా పెరిగి ఉంటే 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

పూల తోటల్లో..

మొక్కలపై ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొఫికొనజోల్ ఒక మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 1–2 పర్యాయాలు పిచికారీ చేయాలి. కోతకు వచ్చిన పూలను వెంటనే కోయాలి. గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో పూలను నిల్వ చేయాలి.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



మూడు గేట్ల ద్వారా దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం వరకు 1,971 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు మూడు క్రస్టు గేట్లను పైకెత్తి 2,340 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలకు 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 643.60 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

యాదగిరి ఆలయ సిబ్బందికి టీటీడీ తరహాలో శిక్షణ

- త్వరలో తిరుపతికి పంపనున్నట్లు వెల్లడించిన ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ సిబ్బందికి టెక్నికల్ మేనేజ్‌మెంట్, రెగ్యులర్ మేనేజ్‌మెంట్, కౌంట్ మేనేజ్‌మెంట్ అంశాలపై శిక్షణ ఇప్పించేందుకు గాను త్వరలో తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించనున్నట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. యాదగిరిగుట్ట పైన తన కార్యాలయంలో ఆలయ అధికారులు, సిబ్బందితో బుధవారం రాత్రి ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీలో అడ్మినిస్ట్రేషన్ పరంగా అవలంబిస్తున్న విధివిధానాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు, టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట క్షేత్రంలో కంప్యూటరైజేషన్ ఏవిధంగా అమలు చేయాలనే అంశాలపై సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చేందుకు దశలవారీగా పంపనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని టెక్నికల్‌గా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా టీసీఎస్ తదితర సంస్థల సేవలు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా దేవస్థానంలో నెట్‌వర్క్ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సంస్థను సంప్రదించి సమస్యను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు ఈ ఆఫీసును విస్తృతంగా ఇంప్లిమెంట్ చేసేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, సీఎస్ఓ, ఏఈఓలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ వెంకట్రావ్